# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 31-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలందరికీ 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

- దేశంలోని ప్రాంతీయ నగరాలను అనుసంధానించే రెండు రహదారి ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

- ఉపాధి హామీ పథకం శ్రామికులకు వీబీ-జీ-రామ్-జీ చట్టం పూర్తి భరోసా కల్పిస్తుందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.

- ఒడిశా తీరం నుండి రెండు "ప్రళయ్" క్షిపణులను డీఆర్‌డీఓ ఈరోజు విజయవంతంగా ప్రయోగించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలందరికీ 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర శుభ సందర్భంలో దేశ విదేశాల్లో ఉన్న భారతీయులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు, శుభాశీస్సులు తెలియజేస్తున్నానని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఒక సందేశంలో పేర్కొన్నారు. నూతన శక్తికి, సానుకూల మార్పులకు కొత్త సంవత్సరం ఒక ప్రతీక అని.. ఇది ఆత్మపరిశీలన, నూతన సంకల్పాలకు అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంలో దేశాభివృద్ధి, సామాజిక సామరస్యం, పర్యావరణ పరిరక్షణ పట్ల మన నిబద్ధతను మరింత బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు. 2026 సంవత్సరం అందరి జీవితాల్లోకి శాంతి, సంతోషం, శ్రేయస్సులను తీసుకురావాలనీ, మరింత బలమైన, సుసంపన్నమైన భారత్ నిర్మాణం కోసం కొత్త శక్తిని అందించాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని ముఖ్యమైన ప్రాంతీయ నగరాలను అనుసంధానించే రెండు కీలక రహదారుల నిర్మాణాలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మహారాష్ట్రలోని నాసిక్-సోలాపూర్-అక్కల్‌కోట్ మధ్య 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ యాక్సెస్-కంట్రోల్డ్ రహదారిని నిర్మించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు సమావేశమైన ఆర్థిక

వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. 374 కిలోమీటర్ల పొడవున్న ఈ కారిడార్‌ను 19 వేల 142 కోట్ల రూపాయల వ్యయంతో బీఓటీ పద్ధతిలో నిర్మించనున్నారు. కర్నూలు నగరాన్ని ఈ ప్రాజెక్టు నాసిక్, అహల్యానగర్, సోలాపూర్ వంటి నగరాలతో కలుపుతుందని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ప్రకారం సమగ్ర రవాణా మౌలిక సదుపాయాల అభివృద్ధిని సులభతరం చేయడంలో భాగంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నామని చెప్పారు. అదే విధంగా ఒడిశాలోని రెండు వరుసల 326 నెంబర్ జాతీయ రహదారిని 1,526 కోట్ల రూపాయలతో విస్తరించేందుకు ఆమోదం లభించిందని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో గజపతి, రాయగడ, కోరాపుట్ గిరిజన జిల్లాలు లబ్ది  పొందుతాయని అశ్విని వైష్ణవ్ వివరిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

అయోధ్యలో రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ జరిగి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ వార్షికోత్సవాన్ని భారతీయ విశ్వాసానికి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే దివ్య ఉత్సవంగా ప్రధానమంత్రి అభివర్ణించారు. స్వదేశీ, విదేశీ భక్తులందరి తరఫున శ్రీరాముని పాదాలకు వినమ్ర నమస్కారాలను అర్పిస్తూ.. దేశ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు రామమందిర సముదాయంలోని ఏడు ఆలయాల్లో ఒకటైన అన్నపూర్ణ ఆలయంపై ధర్మ ధ్వజాన్ని ఎగురవేసి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ఉన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఉపాధి హామీ పథకం (MGNREGA) శ్రామికులకు "వీబీ-జీ-రామ్-జీ" చట్టం పూర్తి భరోసా కల్పిస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బంది, ప్రతినిధులతో దృశ్య మాధ్యమ విధానంలో నిర్వహించిన జాతీయ స్థాయి చర్చా కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొని మాట్లాడారు. కొత్త చట్టంలోని కీలక మార్పులను మంత్రి ఈ సందర్భంగా వివరించారు. గతంలో ఉన్న పరిపాలనాపరమైన ఖర్చుల పరిమితిని 6 శాతం నుండి 9 శాతానికి పెంచినట్లు వెల్లడించారు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వాలు సిబ్బందికి త్వరితగతిన చెల్లింపులు చేయడానికి వీలవుతుందని, అలాగే వారి సేవలు మెరుగుపడి గ్రామీణాభివృద్ధికి మరింత అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ఈ చర్చా కార్యక్రమంలో 45 వేలకు పైగా ప్రాంతాల నుండి 2 లక్షల మంది ఉపాధి హామీ శ్రామికులు, సిబ్బంది పాల్గొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్@2047 లక్ష్య సాధనకు అనుగుణంగా ప్రభుత్వం ఈ ఏడాది అనేక సంస్కరణలు చేపట్టిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ చెప్పారు. 2026 భారత ప్రభుత్వ క్యాలెండర్ ను న్యూఢిల్లీలో ఈరోజు ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వం చేపట్టిన ఈ సంస్కరణలు సమ్మిళిత వృద్ధిని, ఆర్థిక స్థితిస్థాపకతను బలోపేతం చేస్తున్నాయని తెలిపారు. భారతదేశపు దీర్ఘకాలిక అభివృద్ధికి స్థిరమైన పునాది వేయడం అనే స్పష్టమైన లక్ష్యంతో ఈ సంస్కరణలు మార్గనిర్దేశం చేయబడ్డాయని మంత్రి ఎల్.మురుగన్ వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

రెండు “ప్రళయ్” క్షిపణులను డీఆర్‌డీఓ ఈరోజు విజయవంతంగా ప్రయోగించింది ఒడిశా తీరం నుండి ఒకే లాంచర్ ద్వారా తక్కువ వ్యవధిలో ఈ ప్రయోగాలను చేపట్టింది. చండీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ ఏర్పాటు చేసిన ట్రాకింగ్ సెన్సార్ల ద్వారా అందిన సమాచారం ప్రకారం ఈ రెండు క్షిపణులు నిర్దేశిత మార్గంలో ప్రయాణించి అన్ని లక్ష్యాలను చేరుకున్నాయని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. “ప్రళయ్” స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన సాలిడ్ ప్రొపెల్లెంట్ క్వాసీ-బాలిస్టిక్ క్షిపణి. ఇది అత్యంత ఖచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించడానికి అత్యాధునిక గైడెన్స్, నావిగేషన్ వ్యవస్థలను కలిగి ఉంటుంది. ఈ క్షిపణిని హైదరాబాద్‌లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (RCI) ఇతర DRDO ప్రయోగశాలల సహకారంతో అభివృద్ధి చేసింది. వరుస ప్రయోగాలు విజయవంతం కావడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ DRDO, రక్షణ రంగ సంస్థలను అభినందించారు. ప్రళయ్ క్షిపణి యొక్క విశ్వసనీయతను ఈ ప్రయోగం నిరూపించిందని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టిన “పరీక్షా పే చర్చా” కార్యక్రమం చారిత్రాత్మక మైలురాయిని అందుకుంది. వచ్చే ఏడాది జరగనున్న పరీక్షా పే చర్చా 9వ సంచికకు ఇప్పటి వరకు 3 కోట్లకు పైగా రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. పరీక్షా పే చర్చా ఒక ప్రజా ఉద్యమంలా మారిందనడానికి ఈ సంఖ్యే రుజువని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పేర్కొంది. దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనడం ఈ కార్యక్రమానికి పెరుగుతున్న ప్రజాదరణను ప్రతిబింబిస్తుందని తెలిపింది. ఈ చొరవ విద్యార్థుల మానసిక శ్రేయస్సుపై దృష్టి సారిస్తుందని పరీక్షల పట్ల సానుకూల దృక్పథాన్ని ప్రోత్సహిస్తుందని విద్యా మంత్రిత్వ శాఖ తెలియజేసింది. పరీక్షా పే చర్చా 9వ సంచికకు జనవరి 11తో రిజిస్ట్రేషన్ గడువు ముగియనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సెంట్రల్ బోర్డ్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్ (CBSE) 10, 12వ తరగతుల బోర్డు పరీక్షా తేదీలలో స్వల్ప మార్పులు చేసింది. మార్చి 3వ తేదీన జరగాల్సిన 10వ తరగతి పరీక్షలను మార్చి 11కు మార్పు చేసింది. అదే విధంగా మార్చి 3న జరగాల్సిన 12వ తరగతి పరీక్షలు ఏప్రిల్ 10కి మార్చింది. పరిపాలనాపరమైన కారణాల దృష్ట్యా ఈ పరీక్షల తేదీలను మార్పు చేసినట్లు బోర్డు తెలిపింది. ఈ సమాచారాన్ని సంబంధిత విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలని CBSE పాఠశాలలను కోరింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్, ఒడిశా రాష్ట్రాల్లో రేపు ఉదయం వరకూ దట్టమైన పొగమంచు వాతావరణం కొనసాగుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. అదే విధంగా పశ్చిమ అలజడుల కారణంగా కాశ్మీర్ ప్రాంతంలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. మరిన్ని వివరాలను ఐఎండీ శాస్త్రవేత్త స్వర్ణాలీ మజుందార్ తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = =